క్లుప్తంగా

వైభవంగా శ్రావణలక్ష్మి పూజలు

డాబాగార్డెన్స్‌: కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా నిర్వహిస్తున్న శ్రీలక్ష్మీ పూజలు ఆదివారం నాల్గో రోజుకు చేరాయి. ఉదయం 8 గంటలకు వేదమంత్రాలు, నాదస్వరాల నడుమ ప్రారంభమైన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పోస్టుల ద్వారా వచ్చిన భక్తుల పేరిట పూజలు చేసి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపారు. శ్రావణలక్ష్మి పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.400 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని కార్యనిర్వహణాధికారి కె.శిరీష తెలిపారు. పూజలకు సంబంధించి వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఆలయ సహాయ కార్యనిర్వాహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

చీరలు పంపిణీ



మహిళకు చీర అందజేస్తున్న నాగరాజు

డాబాగార్డెన్స్‌: నియోజకవర్గ పరిధి 31వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బత్తిన నాగరాజు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వార్డు మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.


వైఎస్సార్ సీపీ కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం



రామకృష్ణ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న వార్డు కార్పొరేటర్ మేరీజోన్స్

డాబాగార్డెన్స్‌: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన 36వ వార్డు వైఎస్సార్‌సీపీ కార్యకర్త మంగళగిరి రామకృష్ణ కుటుంబాన్ని ఆ వార్డు కార్పొరేటర్ మేరీజోన్స్, వార్డు అధ్యక్షుడు, క్లస్టర్ ఇన్‌చార్జ్ మాసిపోగు రాజు పరామర్శించారు. ప్రభుత్వం నుంచి రావల్సిన బీమా త్వరగా వచ్చేలా చూస్తామని, ఆ కుటుంబానికి అన్ని విధాల సహాయ సహకారాలందిస్తామన్నారు. రామకృష్ణ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దశ దిన కర్మ పురస్కరించుకొని రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు.

వృద్ధుడికి ఆశ్రయం



ఏపీ టూరిస్ట్ పోలీస్ స్టేషన్ వద్ద వృద్ధుడితో పోలీసులు

అల్లిపురం: ఆర్కేబీచ్ కాళీమాత దేవాలయం ఎదురుగా ఫుట్‌పాత్‌పై 71 ఏళ్ల నాగరాజు ఒంటరిగా ఉండడాన్ని టూటౌన్ ట్రాఫిక్ హోంగార్డు ఉదయ శంకర్, ఆర్కేబీచ్ టూరిస్ట్ కానిస్టేబుల్ బి.శివ శంకర్‌లు గమనించి కంట్రోల్ రూమ్‌కు తెలియజేశారు. కంట్రోల్ రూం సీఐ వి.గోపినాథ్ సూచనల మేరకు ఏయూటీడీ నిరాశ్రయ వసతిగృహం మేనేజర్ జ్యోతిర్మయికి తెలియజేశారు. దీంతో ఆమె స్పందించి ఆర్కేబీచ్, కాళీమాత గుడి ఎదురుగా గల ఔట్ పోస్టు వద్ద వృద్ధుడ్ని భీమ్‌నగర్, ఏయూటీడీ నిరాశ్రయ వసతి గృహానికి తీసుకువచ్చి ఆశ్రయం కల్పించారు. వృద్ధుడు ఊరు, పేరు, అడ్రస్ చెప్పలేకపోతున్నాడని పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు వసతి గృహం మేనేజర్‌ను సంప్రదించాలని కోరారు.

ఈవ్‌టీజర్లపై నిఘా పెట్టాలి



కాంప్లెక్స్ బస్టాప్ వద్ద వేచి ఉన్న విద్యార్థినులు, మహిళలు

డాబాగార్డెన్స్‌ : నగరంలోని ఆకతాయిల బెడద ఎక్కువైంది. ఈవ్‌టీజర్ల అరాచకాలు మితిమీరుతున్నాయి. స్కూళ్లు, కాలేజీలు, బస్‌స్టాపుల వద్ద ఈవ్‌టీజర్లు హద్దులు దాటి ప్రవర్తిస్తున్నారు. దీంతో విద్యార్థినులు, యువతులు ఒంటరిగా వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. ఆకతాయిల చేష్టలతో అవస్థలు పడతున్న విద్యార్థినులు, మహిళలు ఎవరికి చెప్పాలో అర్థం కాని పరిస్థితిలో ఉన్నారు. అడపాదడపా తప్ప పోలీసుల చర్యలు పకడ్బందీగా లేకపోవడంతో ఈవ్‌టీజర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. చెప్పుకొంటే నలుగురిలో నవ్వులపాలవుతామనే భయంతో బాధితులు మౌనం వహిస్తున్నారు. నగరంలోని దక్షిణ నియోజకవర్గ ప్రాంత పరిధిలో అనేక కళాశాలలు, పాఠశాలలు ఉన్న విషయం తెలిసిందే. ఉదయం విద్యా సంస్థలకు వెళ్తునప్పుడు, స్కూల్/కళాశాల ముగిశాక తిరిగి ఇంటికి వచ్చే సమయంలో ఆకతాయిలు వారిపట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారంటూ పలువురు విద్యార్థినులు సాక్షి దృష్టికి తీసుకొచ్చారు. అమ్మాయిల వెంటపడి వేధించడం, మద్యం తాగి ఏడిపించడం, శృతిమించి ప్రవర్తించడం నిత్యకృత్యమైంది. పాతజైల్‌రోడ్డులో గల ప్రభుత్వ మహిళా కళాశాలకు అధిక సంఖ్యలో విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.కొంత మంది ఆకతాయిలు పాతజైల్ రోడ్డు, డాబాగార్డెన్స్ ఎల్‌ఐసీ అంబేడ్కర్ బస్‌స్టాప్, ఆర్టీసీ కాంప్లెక్స్ బస్ స్టాప్‌ల వద్ద మాటు వేసి వారిని వేధిస్తున్నారు.

స్కూళ్ల వద్ద రక్షణేది..?

పాఠశాల ఆవరణలోను, ఆరుబయట మందుబాబులు అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారు. ఈవ్‌టీజర్లను నియంత్రించడానికి చర్యలు తీసుకుంటున్నామని పోలీసులు చెప్పడం ప్రకటనలకే పరిమితమవుతున్నాయనే ఆరోపణలున్నాయి. ప్రధాన జంక్షన్లలో పోలీసులు ఏర్పాటు చేసిన ఫిర్యాదుల పెట్టెలు కూడా అటకెక్కాయి.

విద్యార్థులే కాదు..వారి తల్లులకు కూడా..

విద్యార్థినులే గాక మహిళలు, తమ పిల్లల కోసం స్కూళ్లు/కాలేజీలకు వచ్చే తల్లులు కూడా ఈవ్‌టీజర్ల వెకిలి చేష్టలకు ఇబ్బందులకు గురికావాల్సి వస్తుంది. ఈవ్‌టీజర్ల ఆగడాలకు భయపడి కొంతమంది విద్యార్థినులు స్కూళ్లకు రావడానికి కూడా భయపడతున్నట్టుగా చెబుతున్నారు.

కళాశాల ఆవరణలో పిల్లలకు పూర్తి భద్రత



ఈవ్‌టీజింగ్‌లకు ఆస్కారం లేకుండా కళాశాల ఆవరణలో పిల్లలకు పూర్తి భద్రత కల్పిస్తున్నాం. ఉదయం నుంచి రాత్రి వరకు సెక్యూరిటీ ఏర్పాటు చేశాం. ఇంకా ఎవరైనా మా విద్యార్థులను వేధిస్తున్నట్టు తమ దృష్టికి వస్తే చర్యలు చేపడతాం. పోలీసుల దృష్టికి తీసుకెళ్తాం.

–డాక్టర్ ఎస్.శోభారాణి, ప్రిన్సిపాల్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల

చర్యలు తీసుకోవాలి



ఈవ్‌టీజింగ్ జరుగుతున్న ప్రాంతాల్లో నిఘా ఏర్పాటు చేయాలి. విద్యార్థినులను టార్గెట్ చేస్తూ చాలా మంది యువకులు కళాశాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ బెడద ఎక్కువగా ఉంది. పోలీస్ ఉన్నతాధికారులు ఈవ్‌టీజింగ్‌పై చర్యలు చేపట్టాలి.

–ఆర్.ఎస్.మాధవి, నగర వాసి

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి



రాజీవ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న గొంప గోవిందరాజు తదితరులు

డాబాగార్డెన్స్‌: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ 79వ జయంతి పురస్కరించుకొని నగరంలోని జగదాంబ జంక్షన్(లేపాక్షి జంక్షన్)లోని రాజీవ్ విగ్రహానికి నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొంప గోవిందరాజు, పలువురు కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముందుగా పార్టీ కార్యాలయంలో రాజీవ్ చిత్రపటానికి నివాళులర్పించారు. అలాగే బీచ్ రోడ్డు రాజీవ్‌స్మృతి భవన్ వద్ద గల రాజీవ్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఉత్తర నియోజకవర్గం తాటిచెట్లపాలెం జంక్షన్లోని రాజీవ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో పేదలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మూల వెంకట్రావు, బీసీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ గుత్తుల శ్రీనివాసరావు, సేవాదళ్ నేషనల్ కో ఆర్డినేటర్ బమ్మిడి గంగాధర్, పీసీసీ అధికార ప్రతినిధి వజ్జిపర్తి శ్రీనివాసరావు, ఏపీ బీసీ సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు కొణతాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

22 నుంచి నిరవధిక రిలే నిరాహారదీక్షలు

డాబాగార్డెన్స్‌: దీర్ఘకాలికంగా..అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరిం చడంలో యాజమాన్యం వ్యవహరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 22 నుంచి ఏపీఎస్ఆర్‌టీసీ రీజినల్ మేనేజర్ కార్యాలయం వద్ద నిరవధిక రిలే నిరాహారదీక్షలు చేపట్టనున్నట్టు ఏపీఎస్ఆర్‌టీసీ ఎస్ఎమ్‌యూఏ జిల్లా కార్యదర్శి బి.నీలకంఠం, రాష్ట్ర కోశాధికారి పీవీవీ మోహన్, జోనల్ అధ్యక్షుడు ఎంవీఆర్ మూర్తి, కార్యదర్శి ప్రదీప్‌కుమార్ సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. సమస్యలు పరిష్కరించాలంటూ శాంతియుత మార్గంలో నిరసనలు తెలియజేయడమే గాక, స్టీల్‌సిటీ డిపోలో అపరిష్కృత సమస్యల పరిష్కారం కోరుతూ 38 రోజులుగా నిరాహారదీక్షలు చేపట్టినట్టు చెప్పారు. అయినప్పటికీ యాజమాన్యం మొండిగా వ్యవహరించడంతో ప్రాంతీయ మేనేజర్ కార్యాలయం వద్ద నిరవధిక రిలే నిరాహారదీక్షలు చేపట్టనున్నామని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలన్నారు.

సింహాచలేశుడికి శాస్త్రోక్తంగా ఆర్జిత సేవలు



స్వర్ణ పుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, అధికారులు, భక్తులు



నిత్య కల్యాణంలో యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణ పుష్పార్చన నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ బేడా మండపంలో అధిష్టింపజేసి, ఉభయదాతలను స్వర్ణ పుష్పాలతో ప్రదక్షిణ చేయించారు. స్వామి సన్నిధిలో విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహిస్తూ 108 స్వర్ణపుష్పాలతో అర్చన చేశారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ సునీల్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కమనీయం.. నిత్య కల్యాణం

శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్య కల్యాణం కనుల పండువగా జరిగింది. ఉదయం 9.30 గంటలకు ఆలయ బేడా మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులను వేంచేపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా సాగింది. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

టీడీపీ హయాంలోనే పంచగ్రామాల భూసమస్యకు ఆజ్యం



ధర్నా చేస్తున్న సమైక్య ప్రజారైతు సంక్షేమ సంఘం నాయకులు, కార్పొరేటర్ గంగారావు, తదితరులు

- 1996–97లో జారీ చేసిన రైత్వారీ పట్టాలు రద్దు చేయాలి
- సమైక్య ప్రజారైతు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వేపగుంటలో ధర్నా

సింహాచలం: త్వరగా పంచగ్రామాల భూసమస్యను పరిష్కరించాలని సమైక్య ప్రజా రైతు సంక్షేమ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు వేపగుంట కూడలి వద్ద సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం కార్యదర్శి టి.వి.కృష్ణంరాజు మాట్లాడుతూ 1996 వరకు లేని భూసమస్య అప్పటి టీడీపీ ప్రభుత్వం హయాంలోనే ప్రారంభమైందన్నారు. ఆ రోజు నుంచి కష్టాలు మొదలయ్యాయన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు దాటినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం 22(ఏ) నుంచి తొలగించి సర్వీసు ఇనాం భూములను క్రమబద్ధీకరించేందుకు నిర్ణయం తీసుకుందన్నారు. అదే విధంగా 22(సీ) నుంచి జిరాయితీ భూములను కూడా తొలగిస్తూ నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఇప్పటికే హైకోర్టు యథాస్థితిని కొనసాగించాలని తాత్కాలిక ఆర్డర్ జారీ చేసిందని, దాని ప్రకారం ఇళ్ల మరమ్మతులకు, స్థలాల క్రయ విక్రయాలకు, నిర్మాణాలకు అనుమతించాలన్నారు. 1996–97లో అప్పటి టీడీపీ ప్రభుత్వం దేవస్థానానికి ఇచ్చిన రైత్వారీ పట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 1903 సర్వే సెటిల్‌మెంట్ రికార్డు(గిల్‌మెన్ రికార్డు) ఆధారంగా భూహక్కుదారుల్ని గుర్తించాలని కోరారు. 78వ వార్డు కార్పొరేటర్ గంగారావు మాట్లాడుతూ సుమారు 26 ఏళ్లుగా భూసమస్యతో పంచగ్రామాల ప్రజలు బాధలు పడుతున్నారన్నారు. భూసమస్యని పరిష్కరిస్తామని హామీలు కురిపిస్తూ అధికారంలోకి వచ్చిన పార్టీలన్నీ ఆ తర్వాత సమస్యని తీర్చకుండా మిన్నకుండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సమైక్య ప్రజా రైతు సంక్షేమ సంఘం నాయకులు బి.రమణి, సిహెచ్.ఎస్.గోపాలకృష్ణ, ప్రతాప్, అరుణ్‌కుమార్, కె.ఆర్.కె.ప్రసాద్, కోటేశ్వరరావు, ఎస్.రాజు, రమణ, నారాయణరావు, కృష్ణారావు, శంకరరావు, శ్రీనివాసరావు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఐక్య ఉద్యమాలతోనే ఉక్కు పరిరక్షణ

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ప్రజలందరి ఆస్తి అని, దానిని కాపాడుకునేందుకు ప్రతి తెలుగువాడు ఉద్యమించాలని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. ఐక్య ఉద్యమాలతోనే ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షించుకోగలమని, అందరూ కలిసి రావాలని కోరారు. ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన కార్మికుల నిరసన దీక్షలు ఆదివారానికి 920వ రోజుకు చేరుకున్నాయి. దీక్ష శిబిరంలో సంస్థకు చెందిన వివిధ విభాగాల కార్మికులు పాల్గొన్నారు.

సంస్థ ప్రగతిలో మానవ వనరుల నిర్వహణ కీలకం



ఏఐటీయూసీ జాతీయ ఉపాధ్యక్షుడు ఆదినారాయణను సత్కరిస్తున్న ఆచార్యులు

ఏయూ క్యాంపస్‌: సంస్థ ప్రగతిలో మానవ వనరుల నిర్వహణ ఎంతో కీలకమని ఏఐటీయూసీ(ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కౌన్సిల్) జాతీయ ఉపాధ్యక్షుడు, విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ వర్కర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ డి.ఆదినారాయణ అన్నారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం కామర్స్ మేనేజ్‌మెంట్ సమావేశ మందిరంలో ఆదివారం జరిగిన ట్రేడ్ యూనియన్– ఇండస్ట్రియల్ రిలేషన్స్ అనే అంశంపై ఆయన మాట్లాడారు. మానవ వనరుల మేనేజర్‌గా విధి నిర్వహణలో ఎదుర్కొనే వివిధ సవాళ్లు, ఉద్యోగులు, ఉద్యోగ సంఘాలతో సమన్వయం చేయడం, యాజమాన్యానికి, కార్మిక సంఘాలకు మధ్య సహృద్భావ వాతావరణాన్ని కల్పించడం ఎంతో అవసరమన్నారు. సంస్థ అభివృద్ధికి, దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి మానవతా దృక్పథంతో పని చేయాలన్నారు. కార్మిక చట్టాలను అమలు చేయాలని సూచించారు. అనంతరం ఆదినారాయణను విభాగాధిపతి ఆచార్య జాలాది రవి సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.సుబ్బయ్య, డాక్టర్ వై.ఆర్.రెడ్డి, ఎంబీఏ, హెచ్ఆర్ఎం విభాగాల విద్యార్థులు పాల్గొన్నారు.

రామకృష్ణ గీతాలు అజరామరం

బీచ్ రోడ్డు: రామకృష్ణ గీతాలు ప్రజల గుండెల్లో చిరస్మరణీయంగా నిలిచిపోయాయని సెంచూరియన్ విశ్వవిద్యాలయ చాన్సలర్ ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు అన్నారు. సినీ నేపథ్య గాయకుడు వి.రామకృష్ణ 76వ జయంతి కార్యక్రమం ఆదివారం ఉదయం ఆర్కే బీచ్ రోడ్డులోని ఘంటసాల ప్రాంగణంలో ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జి.ఎస్.ఎన్.రాజు మాట్లాడుతూ విజయనగరంలో పుట్టిన రామకృష్ణ.. నేదునూరి కృష్ణమూర్తి వద్ద శాస్త్రీయ సంగీత మెలకువలు నేర్చుకుని ఎన్నో కచేరీలు ఇచ్చారన్నారు. విశాఖ సకల కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షురాలు డా. జాలాది విజయ మాట్లాడుతూ 200 చిత్రాలకు ఐదు వేలకు పైగా పాటలు పాడిన అపర ఘంటసాల వి.రామకృష్ణ అని కొనియాడారు. అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు మాట్లాడుతూ ఆకాశవాణి గాయకుడిగా రంగ ప్రవేశం చేసిన రామకృష్ణ అన్ని వర్గాల ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేశారన్నారు. ఎల్ఐసీ డీవో బొమ్మిడి సత్యనారాయణ, వి.రామకృష్ణ మెమోరియల్స్ అధ్యక్షుడు, గాయకుడు జి.రామకృష్ణ పాల్గొన్నారు.

కిటకిటలాడిన ఎర్నిమాంబ ఆలయం



ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబకు హారతులు ఇస్తున్న భక్తులు, అర్చకులు

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధి కాన్వెంటు కూడలిలోని ఎర్నిమాంబ అమ్మవారి ఆలయంలో శ్రావణ మాస శుద్ధ విదియ ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులతో ఆలయం కిటకిటలాడింది. దేవాదాయశాఖ ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలకు కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఆలయ పరిసరాల్లో భక్తులు వంటవార్పు చేసుకుని మేళతాళాలతో మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల వంటావార్పులకు నీడ లేకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. దీనిపై ఆలయ ఈవో సురేష్‌బాబా మాట్లాడుతూ భక్తుల వంటవార్పులకు శాశ్వత టెంట్‌లను వాహనదారులకు, పాదచారులకు ఇబ్బంది లేకకుండా త్వరలో 30 అడుగుల ఎత్తు షెడ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. ఆలయ సిబ్బంది ప్రసాద్, అప్పలరాజు తదితరులు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

జీవితాల్లో 'మార్పు' తెచ్చుకోండి

- నేరాలకు దూరంగా ఉండండి
- రౌడీ షీటర్లకు అవగాహన



రౌడీ షీటర్లకు, సస్పెక్ట్ షీటర్లకు అవగాహన కల్పిస్తున్న క్రైం డీసీపీ గంధం నాగన్న

అల్లిపురం: జీవన విధానంలో మార్పు తెచ్చుకొని జీవితాలను ఉన్నతంగా మార్చుకోవాలని క్రైం డీసీపీ గంధం నాగన్న రౌడీ షీటర్లకు సూచించారు. టూటౌన్ దరి సీసీఎస్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం ఉదయం ఆయన రౌడీ షీటర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీషీట్లతో జీవితాలను పాడు చేసుకోకూడదన్నారు. నేరాలకు దూరంగా ఉండాలని తెలిపారు. గత జీవితాన్ని మార్చుకుని కష్టపడి పనిచేయాలని సూచించారు. ప్రతి క్షణం మీరు చేసే పనులపై పోలీసు నిఘా ఉంటుందన్నారు. జీవన విధానంలో మార్పు తెచ్చుకుని కష్టపడి పనిచేసే వారిని గుర్తించి, వారిపై రౌడీ షీట్ తొలగించేందుకు ప్రయత్నిస్తామన్నారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సీఎం త్రివిక్రమ్ వర్మ ఆదేశాల మేరకు నగరంలో నేరాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మార్పు కార్యక్రమం ద్వారా నేరాలు చేస్తున్న వారి జీవితాల్లో మార్పు తీసురావాలనేది ప్రధాన ఉద్దేశమని తెలిపారు. నేరమయ జీవితాన్ని విడనాడిన వారిని గుర్తించి అవసరమైన వారికి తమ వంతు సహకారం అందించనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరితో మాట్లాడి వారి స్థితిగతులు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో క్రైం ఏసీపీ, టూటౌన్, మహారాణిపేట సీఐలు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో సేవా కార్యక్రమాలు



వృద్ధులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న జాన్‌వెస్లీ, కార్పొరేటర్ నారాయణరావు

డాబాగార్డెన్స్‌: ఏపీ నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ కనకల ఈశ్వర్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా పరిషత్ సమీపాన గల వృద్ధాశ్రమంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ స్టేట్ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బొల్లవరపు జాన్‌వెస్లీ చేతుల మీదుగా కేక్ కట్ చేయించి, వృద్ధులకు తినిపించారు. అనంతరం వృద్ధులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. జిల్లా పరిషత్ జంక్షన్లో పార్టీ యువజన విభాగం కార్యదర్శి చంద్రమౌళి నేతృత్వంలో పేదలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ ఉరుకుటి నారాయణరావు, సుబ్బారెడ్డి, చిన్ని, నర్సింగ్, నీలాపు లక్ష్మీ, పల్లా రాధాలక్ష్మి, రఘునాథ్, చల్లనాయుడు, గొలగాని శివప్రసాద్, రామకృష్ణ, నడిపూడి రాజు, గుర్నాథరావు, శ్రీను, సతీష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద సంస్థకు పుస్తకాల వితరణ



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న కొండా రాజీవ్‌గాంధీ

జగదాంబ: స్వామి వివేకానంద సేవా సంస్థకు బాల గ్రంథాలయం రోటరీ కపుల్స్ పుస్తకాలను అందజేశారు. ఆదివారం జీవీఎంసీ 39వ వార్డులో ఉన్న ఈ సంస్థకు 500 పుస్తకాలను అందజేశారు. ఎందరో మహానుభావుల జీవిత చరిత్ర, ఇంగ్లిష్, తెలుగు భాషల్లో ఎన్నో అమూల్యమైన పుస్తకాలను అందించిన రోటరీ క్లబ్ వారికి ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. సందర్భంగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సంస్థలో నిర్వహించిన చిత్రలేఖం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయుడు మాస్టారు, బీడీఈ సెంటర్ ఇన్‌చార్జీ ఉమాదేవీ, సంస్థ అధ్యక్షుడు అప్పారావు, సభ్యులు ఎస్ఎస్ రమాప్రియ, ఎస్.శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

సంగీత, నృత్యాలతో స్వాతంత్య్ర వేడుక



కళాకారుల ప్రదర్శన



కళాకారుల నృత్య ప్రదర్శన

డాబాగార్డెన్స్‌: ఇతిహాస్ కే పన్నోంసే (చరిత్ర పుటల్లోంచి) శీర్షికన భారత స్వతంత్య్ర సంగ్రామంలో వీరోచితంగా పోరాడి అసువులుబాసిన యోధానుయోధులను కళ్లకు కట్టినట్టు చూపించే కార్యక్రమం ఆదివారం డాబాగార్డెన్స్‌లో గల అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. నిర్వాహకులు మాట్లాడుతూ 77వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ముంబైకి చెందిన హెరిటేజ్ స్టోరీస్ అండ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ సంస్థ అరుదైన ఈ సంగీత, నృత్య, కథా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందన్నారు. ఈ సందర్భంగా ముంబై, చెన్నై, హైదరాబాద్, విశాఖపట్నం, కాకినాడ తదితర ప్రాంతాలకు చెందిన విశేష నైపుణ్యాలున్న కళాకారుల ప్రదర్శన ఆకట్టుకుంది. భారతదేశం నలుమూలల పేరెన్నికగన్న స్వాతంత్య్ర సమరయోధులు, వారి వారసులు ఈ కార్యక్రమంలో పాల్గొని అనుభవాలు పంచుకున్నారు.

నేడు డయల్ యువర్ ఆర్డీవో రద్దు

మహారాణిపేట: సోమవారం జరిగే డయల్ యువర్ ఆర్డీవో కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు విశాఖ రెవెన్యూ డివిజనల్ అధికారి డి.హుస్సెన్ సాహెబ్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం జరిగే ఈ కార్యక్రమం ఈ వారం నిర్వహించడం లేదన్నారు. అందువల్ల ఫిర్యాదుదారులు ఎవరు ఫోన్ చేయవద్దని ఆదివారం ఓ ప్రకటనలో కోరారు.